
సోమవారం తూప్రాన్ మండలంలో మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

# హ్యాట్రిక్ సీఎం కేసీఆరే..

- మన ఓటుతో సీఎం కావడం మన అదృష్టం
- కులవృత్తులను కాపాడిన వ్యక్తి సీఎం కేసీఆర్
- అరవై ఏండ్ల పాలనలో కాంగ్రెస్, బీజేపీ చేసిందేమీలేదు
- హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ చరిత్ర సృష్టించడం ఖాయం
- రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

తూప్రాన్, నవంబర్ 13: మనం వేసే ఓటుతోనే ఎమ్మెల్యేగా గెలిచి, తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం మన అదృష్టమని రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, తెలంగాణ ఫుడ్ మాజీ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సీఎం కేసీఆర్‌కు మద్దతుగా తూప్రాన్ మండలంలోని తొమ్మిది గ్రామాల్లో బైక్ ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. సోమవారం ఉదయం తొలుత కోనాయపల్లి (పీబీ)లో నిర్వహించిన రోడ్ షోలో వారు పాల్గొని, బీఆర్‌ఎస్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం మండలంలోని మల్కాపూర్, నర్సంపల్లి, వెంకటాయపల్లి, గుండ్రెడ్డిపల్లి, కిష్టాపూర్, యావాపూర్, ఇమాంపూర్, ఘనపూర్ గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కళాకారుల ఆటపాటలు అలరించాయి. బీఆర్‌ఎస్ నేతలు ప్రచార కార్యక్రమానికి వస్తున్నారంటే ప్రజలంతా పనులు మానుకుని ఆద్యాంతం ఉత్సాహంతో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డప్పుచప్పుళ్లు, బ్యాండ్ మేళాలతో గ్రామస్తులు, మహిళలు బతుకమ్మ, బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కల్లాల దగ్గర కొత్త బిచ్చగాళ్లు వచ్చినట్లు ఎన్నికలు రాగానే కాంగ్రెస్, బీజేపీ నాయకులు వస్తారని, వాళ్ల కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అరవై ఏండ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రానికి చేసిందేమీలేదన్నారు. ముచ్చటగా మూడోసారి గెలిచి, హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ చరిత్ర సృష్టించబోతున్నారన్నారు. రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ హయాంలో రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2 వేలకు పెంచిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడిస్తున్న రూ.2 వేల పింఛన్‌ను రూ.5వేలకు, రూ.400లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీలు గెలిస్తే రాష్ట్రం అంధకారం అవుతుందన్నారు.

### దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్: వంటేరు

బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణలోనే అమలవుతున్నాయన్నారు. 24 గంటల ఉచిత కరెంటు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, ఇంటింటికీ తాగునీరు, సాగునీరు అందివ్వడంతో పాటు, పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి కార్యక్రమాలతో గ్రామాల రూపురేఖలే మారాయన్నారు. ఎక్కడ చూసినా ప్రగతి పరుగులే కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకం అందని గడప లేదంటే అతిశయోక్తి కాదన్నారు. కేంద్రంలోని మోదీ సర్కారు సామాన్యుల నడ్డి విరుస్తూ, కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకొస్తే అరవై ఏండ్ల పాలనలో ఏంచేశారో నిలదీయాలన్నారు. కులమతాల మధ్య చిచ్చు రేపి రాజకీయ లబ్ధి పొందేందుకే ప్రతిపక్షాల ఆరాటమన్నారు. బీజేపీ అంటే ఝూటా మాటల పార్టీ అన్నారు. కులవృత్తుల ఆర్థికాభివృద్ధికి చేయూతనందించిన ఏకైక పార్టీ బీఆర్‌ఎస్సేనన్నారు. అధికారంలోకి రాగానే ప్రతి వ్యక్తికి రూ.15 లక్షల ఆరోగ్య బీమా, అన్నపూర్ణ పథకం ద్వారా తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం, వృద్ధులకు రూ.5 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్, రైతు బంధు సాయం రూ.16 వేలు, సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా అర్హులైన ప్రతి మహిళకు రూ.3 వేల జీవన భృతి, ఇండ్లు నిర్మించుకోవడానికి రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వప్నావెంకటేశ్ యాదవ్, జడ్పీటీసీ రాణి సత్యనారాయణ గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భగవాన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు గౌడ్, కోనాయపల్లి సర్పంచ్ పాండు, మల్కాపూర్ సర్పంచ్ మహదేవి నవీన్, నర్సంపల్లి సర్పంచ్ కత్తుల సత్యనారాయణ, వెంకటాయపల్లి సర్పంచ్ లంబ వెంకటమ్మ, గుండ్రెడ్డిపల్లి సర్పంచ్ శ్రీలత రాజిరెడ్డి, యావాపూర్ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఇమాంపూర్ సర్పంచ్ ఎల్లం, ఘనపూర్ సర్పంచ్ పుష్పానవీన్, ఎంపీటీసీలు సంతోష్‌రెడ్డి, వెంకటమ్మ, గ్రామ కమిటీ అధ్యక్షులు, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజలు భారీ ఎత్తున్న పాల్గొన్నారు.


సోమవారం తూప్రాన్ మండలంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

మెదక్ నియోజకవర్గం రౌండప్

# మెదక్.. న్యూ లుక్

స్వరాష్ట్రంలో మెదక్ నియోజకవర్గంలో అభివృద్ధి ఘనం

### అభివృద్ధి, సంక్షేమం
## మాకు రెండు కండ్లు..



నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నా. వివిధ పనుల కోసం సీఎం కేసీఆర్ కోట్ల రూపాయలు మంజూరు చేశారు. జిల్లా కేంద్రంలో రూ.50 కోట్లతో మిషన్ భగీరథ మంచినీటిని సరఫరా చేస్తున్నాం. జిల్లా ఏర్పడిన తర్వాత కలెక్టరేట్ భవనం, ఎస్పీ కార్యాలయంతో పాటు ఎంసీహెచ్‌ను మంజూరు చేయించాను. నియోజకవర్గంలో రూ.1167 కోట్లతో రోడ్ల అభివృద్ధికి నిధులు తెప్పించాను. ఘనపూర్ ఆనకట్ట ఎత్తు పెంపునకు సీఎం కేసీఆర్ రూ.43 కోట్లు నిధులు కేటాయించారు. మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలకు పెద్దఎత్తున నిధులు తెచ్చా. అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లుగా పాలన కొనసాగిస్తున్నా. నా హయాంలో అభివృద్ధి ఎంతో కృషి చేశా.

– ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, మెదక్

- రూ.1167 కోట్లతో రోడ్ల అభివృద్ధి
- రూ.43 కోట్లతో ఘనపూర్ ఆనకట్ట అభివృద్ధి
- జిల్లాకేంద్రంలో రూ.50 కోట్లతో మిషన్ భగీరథ పనులు
- మెదక్‌కు మెడికల్ కళాశాల
- రింగ్‌రోడ్ మంజూరు
- మున్సిపాలిటీల అభివృద్ధికి నిధుల వరద

మెదక్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పాలనలో మెదక్ నియోజకవర్గంలో అభివృద్ధి దిశలో పయనిస్తున్నది. స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి కృషిచేస్తున్నారు. సీఎం కేసీఆర్ మెదక్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేశారు. మెదక్‌లో నూతన సమీకృత కలెక్టరేట్, పోలీస్ కార్యాలయం ఏర్పాటు చేశారు. మెదక్ పట్టణంలో నాలుగు వరుసల రోడ్డు, సెంట్రల్ లైటింగ్, కూడళ్ల సుందరీకరణ చేపట్టడంతో పట్టణం కొత్త రూపును సంతరిచుకుంది.గ్రామాలు, మండల కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయి.


మెదక్ కలెక్టరేట్


మెదక్ ఎస్పీ కార్యాలయం


మెదక్ ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్, పచ్చదనం

## ఘనపూర్ ప్రాజెక్టుకు రూ.141 కోట్లు..

115 ఏండ్ల క్రితం నిర్మించిన ఘనపూర్(వనదుర్గా) ప్రాజెక్టు నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. నవాబుల కాలంలో నిర్మించిన ఈ ప్రాజెక్టు సీమాంధ్ర పాలకుల హయాంలో నిర్లక్ష్యానికి గురైంది. స్వరాష్టంలో పూర్వవైభవాన్ని సంతరించుకుంది. ఈ ప్రాజెక్టుకు సీఎం కేసీఆర్ వనదుర్గాగా నామకరణం చేశారు. ప్రాజెక్టు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసింది. ప్రాజెక్టు ఎత్తు పెంపునకు రూ.43.64 కోట్లు కాగా, కొల్చారం, పాపన్నపేట మండలాల్లో 190 ఎకరాల భూ సేకరణకు రూ.13.10 కోట్లు ఇచ్చింది. ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేసే మహబూబ్‌నహర్, ఫతేనహర్ కెనాల్లను అభివృద్ధి చేసింది. మెదక్, పాపన్నపేట, హవేళీఘనపూర్ మండలాల్లో ఆయా కాలువల పరిధిలో చెరువులన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. సింగూరు ప్రాజెక్టు నుంచి వనదుర్గా ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయడంతో మంజీరా నది పరీవాహక ప్రాంత రైతులు పంటలను పండిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఘనపూర్ ప్రాజెక్టుకు పూర్వవైభవం వచ్చింది. 2014లో నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, అప్పటి డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి వెనక్కి వెళ్లిన జైకా నిధులు రూ.25 కోట్లను తెప్పించారు. 2014 డిసెంబర్ 17న సీఎం కేసీఆర్ ఘనపూర్ ఆనకట్టను సందర్శించి హెలీకాప్టర్ ద్వారా వీహంగ వీక్షణం చేసి రూ.50 కోట్లు మంజూరు చేస్తానని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం ఆనకట్ట ఎత్తు పెంపునకు రూ.43.64 కోట్లు మంజూరు చేశారు. ఆనకట్ట ఎత్తు పెంపుతో 30వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఘనపూర్ ప్రాజెక్టుకు రూ.100 కోట్లు మంజూరు చేశారు.


పాపన్నపేట మండల పరిధిలోని ఘనపూర్ ప్రాజెక్టు

## తొమ్మిదేండ్లలో అభివృద్ధి పరుగులు..

మెతుకుసీమ మెదక్ ప్రాంతం తొమ్మిదేళ్లలో అనూహ్య ప్రగతి సాధించింది. మెదక్ నియోజకవర్గంలోని మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలను రూ.106 కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి చేసింది. మెదక్ జిల్లా కేంద్రంలోని గోసంద్రం చెరువును రూ.9 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసింది. మెదక్ పట్టణంలో రూ.20 కోట్లతో మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రభుత్వం నిర్మించింది. రూ.180 కోట్లతో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నది. మిషన్ కాకతీయలో రూ.340 కోట్లతో చెరువులను అభివృద్ధి చేసింది. జిల్లా కేంద్రంలో 32 ఎకరాల్లో రూ.67.07 కోట్లతో సమీకృత కలెక్టరేట్, 63 ఎకరాల్లో రూ.38.50 కోట్లతో రాజభవనాన్ని తలపించేలా జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని బీఆర్‌ఎస్ సర్కారు నిర్మించింది. రూ.50 కోట్లతో మహబూబ్‌నహర్, ఫత్తేనహర్ కాలువల సిమెంట్ లైనింగ్ పనులు పూర్తిచేసింది. మెదక్ నియోజకవర్గంలోని మెదక్ మండలం ర్యాలమడుగు హల్దీవాగుపై రూ.20.98 కోట్లతో చెక్‌డ్యాం, మంజీర వాగుపై హవేళీఘనపూర్ మండలం సర్ధన గ్రామంలో రూ.12.15 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించడంతో రైతులకు సాగునీటి బెంగతీరింది.

## రూ.50.35 కోట్లతో కాలువల అభివృద్ధి..

ఘనపూర్ ప్రాజెక్టు పరిధిలో మహబూబ్‌నహర్, ఫత్తేనగర్ కాలువల ద్వారా చివరి ఆయకట్టుకూ సాగునీరందించడానికి సిమెంట్ లైనింగ్ పనులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2015–16లో రూ.23 కోట్లు కేటాయించింది. 2017–18లో రూ.21 కోట్లు కేటాయించింది. మహబూబ్‌నహర్ కాలువ 43.68 కిలోమీటర్ల పరిధిలో 32 కిలోమీటర్ల వరకు పనులు పూర్తి చేసింది. 2016లో అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్‌రావు, అప్పటి డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి హవేళీఘనపూర్ మండలం ముత్తాయిపల్లి శివారు వద్ద మహబూబ్‌నహర్ కెనాల్‌ను పరిశీలించారు. కొల్చారం, మెదక్ మండలాల్లో పనులు పూర్తి కాగా, హవేళీఘనపూర్ మండలం శాలిపేట నక్కవాగ వద్ద సిమెంట్ లైనింగ్ పనులు నిలిచిపోయాయి. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు ఎంఎన్, ఎఫ్ఎన్ కాలువల సిమెంట్ లైనింగ్ పనుల కోసం రూ.55 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 2022 బడ్జెట్‌లో రూ.50.35 కోట్లు ఎంఎన్, ఎఫ్ఎన్ కాలువల సిమెంట్ లైనింగ్ పనులకు కేటాయించారు. ఇందులో 10 కిలోమీటర్లు సిమెంట్ లైనింగ్ పనులకు రూ.21 కోట్లు కేటాయించారు. ఈ పనులు హవేళీఘనపూర్ మండలం శాలిపేట నుంచి పోచారం డ్యాం వరకు పూర్తయ్యాయి. హవేళీఘనపూర్ మండలం శాలిపేట, బిబిపూర్, ముత్తాయికోట, సర్ధన, ఫరీద్‌పూర్, జక్కన్నపేట, పోచమ్మరాల్ వరకు నీళ్లు అందుతున్నాయి.


ఆధునీకరించిన మహబూబ్‌నహర్ కాలువ


మెదక్ రైతు వేదిక

## 25 రైతు వేదికలు...

రాష్ట్ర ప్రభుత్వం మెదక్ నియోజకవర్గంలో 25 రైతు వేదికలను ఏర్పాటు చేసింది. ఇక్కడ రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు వ్యవసాయ శాఖ అధికారులు ఇస్తున్నారు. ప్రతి ఐదు ఎకరాలకు ఒక క్లస్టర్‌గా విభజించి రైతు వేదికలు నిర్మించారు. 24 గంటల పాటు వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండి రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు.

## రూ.50 కోట్లతో మిషన్ భగీరథ

సీఎం కేసీఆర్ మానస పుత్రిక మిషన్ భగీరథ. ఈ పథకంలో మెదక్ జిల్లా కేంద్రంలో రూ.50 కోట్లతో పనులు చేపట్టారు. మెదక్ మున్సిపాలిటీలో సుమారు 70వేల జనాభా ఉండగా, 32 వార్డులకు ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తున్నది. నియోజవర్గంలోని అన్ని మండలాల్లో మిషన్ భగీరథ ట్యాంకులు నిర్మించి, ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ సౌకర్యం కల్పించింది. నీటి కోసం మహిళలకు తిప్పలు తప్పాయి. పానీపట్టు యుద్ధాలు ఆగిపోయాయి. మెదక్ పట్టణంలో సింథటిక్ మైదానం ఏర్పాటు చేసి క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ఇటీవల మెదక్‌కు మెడికల్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది.ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ మెదక్‌కు రింగ్‌రోడ్డును మంజూరు చేశారు.

## రూ.1167 కోట్లతో రోడ్ల అభివృద్ధి..

మెదక్ నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో రూ.40 0 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.462 కోట్లు, ఆర్‌అండ్‌బీ శాఖ రూ.305 కోట్లతో రోడ్ల మరమ్మతులు, బీటీ రెన్యువల్స్ పనులను పూర్తిచేశారు. గిరిజన ప్రాంతాల రోడ్లకు రూ.44 కోట్లు, పంచాయతీరాజ్ రోడ్లకు రూ.20 కోట్లు, మరో రూ.10 కోట్లు మరమ్మతులు, ఇంకో రూ.10 కోట్లు బీటీ రెన్యువల్స్‌కు, వీటితో పాటు ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.24 కోట్లు కేటాయించింది. మెదక్–సిద్దిపేట–ఎల్కతుర్తి జాతీయ రహదారి 765 డీజీ పనులు ప్రభుత్వం చేపడుతున్నది. మెదక్–సిద్దిపేట ఒక బిట్టుగా, సిద్దిపేట –ఎల్కతుర్తి వరకు రెండో బిట్టుగా రహదారిని విభజించారు. సిద్దిపేట – ఎల్కతుర్తి 63.641 కిలోమీటర్ల రహదారికి రూ.578.85 కోట్లు, మెదక్ నుంచి సిద్దిపేట వరకు రహదారి విస్తరణకు 70 కిలోమీటర్ల రూ.882 కోట్లతో ప్రభుత్వం పనులు చేపడుతున్నది.

## మారిన రూపురేఖలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ మెదక్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో రూపురేఖలు మారిపోయాయి. మెదక్ జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత మెదక్‌లోనే నూతన సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, వంద పడకల మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. మెదక్ నియోజకవర్గంలో మెదక్ మున్సిపాలిటీ, రామాయంపేట మున్సిపాలిటీలకు పెద్దఎత్తున నిధులు మంజూరయ్యాయి. గతంలో పట్టణాలతో పాటు గ్రామాలు అంతగా అభివృద్ధికి నోచుకోలేదు. ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం వేయడంతో నివాస ప్రాంతాలు దుర్గంధభరితంగా ఉండేవి. రోడ్లకు ఏండ్ల తరబడి మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. సీఎం కేసీఆర్ పట్టణాలతో పాటు పల్లెలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడంతో అన్ని సమస్యలు పరిష్కారమై నేడు సరికొత్తగా దర్శనమిస్తున్నాయి.

## మెదక్ నియోజకవర్గంలో నిధుల కేటాయింపు...

| | |
|---|---|
| మెదక్, రామాయంపేటల పట్టణాభివృద్ధికి | రూ.106 కోట్లు |
| ఇరిగేషన్ | రూ.400 కోట్లు |
| పంచాయతీరాజ్ | రూ.462 కోట్లు |
| వ్యవసాయ శాఖకు | రూ.543 కోట్లు |
| ఆర్‌అండ్ బీ రోడ్లు | రూ.305 కోట్లు |
| విద్యుత్ శాఖ | రూ.60 కోట్లు |
| వైద్య, ఆరోగ్య శాఖ | రూ.100 కోట్లు |
| చేప పిల్లల పంపిణీ | రూ.8.50 కోట్లు |
| గొర్రెల పంపిణీ (4,358 మంది) | రూ.531 కోట్లు |
| 21 యూనిట్స్ | |
| ఎస్సీ కార్పొరేషన్ (రైతుబంధు) | రూ.10 కోట్లు |
| సీఎంఆర్ఎఫ్ నిధి | రూ.75 కోట్లు |
| ఎల్‌వోసీలు | రూ.15 కోట్లు |
| కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ 14,836 మందికి | రూ.130 కోట్లు |
| మెదక్ రైల్వేలైన్ | రూ.205 కోట్లు |
| ఆర్‌డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ | రూ. 454 కోట్లు |
| ఆసరా పింఛన్లు | రూ.8.35 కోట్లు |
| మెదక్ నియోజకవర్గ అభివృద్ధి సీడీసీ నిధులు | రూ.20 కోట్లు |
| ఏడుపాయల దేవస్థానం అభివృద్ధి నిధులు | రూ.10 కోట్లు |
| మిషన్ కాకతీయ | రూ.340 కోట్లు |
| ఆర్‌డబ్ల్యూఎస్ | రూ.110 కోట్లు |

## మెదక్‌కు రైలొచ్చింది..



మెదక్ ప్రజల చిరకాల కోరికైన మెదక్ రైల్వేలైన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చింది. రైల్వేలైన్ నిర్మాణానికి తన వాటాగా రూ.85.75 కోట్లు మంజూరు చేసింది. ఉమ్మడి ప్రభుత్వాలు రైల్వేలైన్ కోసం శంకుస్థాపన చేసి వదిలిపెట్టగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెదక్–అక్కన్నపేట రైల్వేస్టేషన్‌కు 17 కిలోమీటర్ల మేర నిధులు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేసింది. రైల్వేలైన్ కోసం 900 మంది రైతులు 370 ఎకరాల భూములను ఇవ్వగా, భూ సేకరణ కోసం ప్రభుత్వం రూ.16.84 కోట్లు నష్టపరిహారం అందించింది. మెదక్–అక్కన్నపేట మార్గంలో మూడు స్టేషన్లు ఉండగా, రామాయంపేట మండలం లక్ష్మాపూర్, హవేళీఘనపూర్ మండలంలోని శమ్నాపూర్‌తో పాటు జిల్లా కేంద్రం మెదక్‌లో రైల్వేస్టేషన్లు ఏర్పాటు చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిల సహకారంతో మెదక్–అక్కన్నపేట రైల్వేస్టేషన్ రూపుదిద్దుకున్నది. దీంతో, మెతుకు సీమ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మెదక్ రైల్వే స్టేషన్ పనులకు సంబంధించి ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఎప్పటికప్పుడు రైల్వే శాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించి రైల్వే పనులు త్వరగా పూర్తి చేయించి మెదక్ వాసులకు రైలు ప్రయాణం అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం నిత్యం రైళ్లు తిరుగుతున్నాయి.